
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 29 డిసెంబరు 2024



● కల్యాణం.. కమనీయం



షాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ధైవాలగూడలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేడుకలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య, నాయకులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు.



మేడ్చల్ పట్టణ ఏరియల్ వ్యూ

మేడి చెలిమ నుంచి మేడ్చల్‌గా..

Sunday Special

- నామకరణం చేసిన బాటసారులు
- చెరువు అంచుల్లోని మేడి చెట్టుకింద వ్యాపారుల బస

మేడ్చల్ టౌన్, డిసెంబరు 28: ఒకప్పుడు మేడ్చల్ ప్రాంతానికి ప్రత్యేకంగా పేరంటూ ఉండేది కాదు. ఈ ప్రాంతం గుండా వెళ్లే బాటసారులు సేద తీర్చుకోవడానికి స్థానిక చెరువు అంచుల్లో ఉన్న పెద్ద మేడి చెట్టు దగ్గర సేద తీరేవారు. ఆ బాటసారులు అక్కడ దాహం తీర్చుకోవడానికి ఓ నీటి చెలిమ(గుంత)ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మేడి చెట్టులోని మేడి, చెలిమిని కలిపి ఆ ప్రాంతాన్ని మేడి చెలిమిగా పిలిచేవారు. అలా కాలక్రమేణా అది మేడ్చల్‌గా మారింది. స్థానికంగా నాలుగు వందల సంవత్సరాల చరిత్రను చాటే చిహ్నాలు ఉన్నప్పటికీ అంతకు పూర్వం ఈ ప్రాంత చరిత్రను చాటే సత్తా పెద్ద చెరువుకు దక్కుతుందని స్థానికులు అంటున్నారు. మేడ్చల్ అనే పేరు ఎలా వచ్చిందన్న విషయం పట్ల భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ స్థానికులు మాత్రం ఈ పేరు మేడి చెలిమి నుంచి పుట్టిందని గట్టిగా నమ్ముతున్నారు.

వలస వచ్చినవారికి లక్కీస్పాట్

కుగ్రామంగా ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం పట్టణంగా మారింది. పట్టణాన్ని తలపించే విధంగా ఉన్న మేడ్చల్ పూర్వం బాటసారులకు, ప్రస్తుతం పొట్ట చేత పట్టుకొని జీవనోపాధి కోసం వచ్చిన వారికి లక్కీ స్పాట్‌గా మారింది. దీంతో ఈ ప్రాంతంలో శాశ్వతంగా స్థిరపడ్డ వతన్‌దార్ల కన్న కడుపును నమ్ముకొని వచ్చిన వారికే

- మిగతా 6వ పేజీలో..



మేడ్చల్ రైల్వే స్టేషన్

చేవెళ్ల మండలం ఆలూరు గేట్ వద్ద కూరగాయ రైతులపైకి దూసుకెళ్లిన లారీ(ఫైల్)



ప్రతీ ఏడాది గుబులు పుట్టిస్తున్న నేరాలు, ఘోరాల సంఖ్య ఈ సారి కూడా పెరిగింది. దొంగతనాలు, హత్యలు, అత్యాచారాలు అధికమయ్యాయి. మహిళలపై జరుగుతున్న ఆగడాలకు హద్దూ అదుపు లేకుండా పోయింది. ప్రతీ సంవత్సరం ఈ కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. గతేడాది కంటే ఈ సారి పెరిగిన నేరాల సంఖ్య జిల్లా ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ని చర్యలు తీసుకున్నా వాటికి అడ్డుకట్ట పడటం లేదు. ఈ ఏడాది ప్రమాదాలు, మృతుల సంఖ్య మరింత పెరిగింది. ఈ సంవత్సరం చోటుచేసుకున్న ఘోరాలు, నేరాలపై రౌండప్..



క్రైం రన్!

రౌండప్ 2024 roundup

జిల్లాలో ఈ ఏడాది పెరిగిన నేరాలు

- అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు.. వందల సంఖ్యలో మృతులు
- మహిళలపై అధికమైన అత్యాచారాలు, లైంగిక వేధింపులు
- పెరిగిన దొంగతనాలు, హత్యలు
- తగ్గిన దోపిడీ, కిడ్నాప్ కేసులు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2024 సంవత్సరానికి సంబంధించి మొత్తం 9,980 కేసులు నమోదయ్యాయి. గత ఏడాదిలో నమోదైన మొత్తం కేసులను పరిశీలిస్తే ఈ సారి వీటి సంఖ్య ఎక్కువగానే ఉంది. చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 2,446 కేసులు నమోదు కాగా, ఇబ్రహీంపట్నం పరిధిలోని ఇబ్రహీంపట్నం, యాచారం, ఆదిభట్ల, మంచాల, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ మాడ్గుల పోలీస్టేషన్ పరిధిలో మొత్తం 2,425 కేసులు నమోదయ్యాయి. అలాగే మహేశ్వరం, కందుకూరు పీఎస్ పరిధిలో 703 కేసులు నమోదు కాగా... షాద్‌నగర్, కొందుర్గు, కొత్తూరు, చౌదరిగూడ, మాడ్గుల పరిధిలో 1,736 కేసులు నమోదయ్యాయి. శంషాబాద్‌లోని రెండు పోలీస్‌స్టేషన్లలో మొత్తం 1,703 కేసులు నమోదయ్యాయి.

నెత్తురోడిన రోడ్లు..

జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల సంఖ్యను పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తుంది. గతేడాది జిల్లాలో 997 రోడ్డు ప్రమాదాలు జరగగా, ఈ సారి ఆ సంఖ్య 1,394కు చేరింది. అత్యధికంగా 307 రోడ్డు ప్రమాదాలు చేవెళ్ల పరిధిలోనే చోటు చేసుకున్నాయి. బీజాపూర్ (163) హైవే అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి సింగిల్

- మిగతా 8వ పేజీలో..

రంగారెడ్డి రూరల్ నియోజకవర్గాల పరిధిలో కేసుల వివరాలు

నేరం	2021	2022	2023	2024
హత్యలు	48	14	29	36
అత్యాచారాలు	124	73	112	116
ఆత్మహత్యలు	426	373	59	344
లైంగిక వేధింపులు	100	203	125	207
దోపిడీలు	36	18	179	35
దొంగతనాలు	617	395	390	1,055
కిడ్నాప్‌లు	82	59	95	95
రోడ్డు ప్రమాదాలు	996	971	997	1,394
మృతులు	340	260	354	430
మిస్సింగ్స్	724	631	582	771
ఇతర కేసులు	4,065	3,606	3,788	5,506
మొత్తం	7,558	6,603	6,710	9,989

ధ్యానంతో ఆరోగ్యం

● బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి



వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

కడ్తాల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ధ్యానం అహాన్ని దూరం చేస్తుందని.. నిగ్రహ శక్తి, ఆత్మజ్ఞానం, సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి తెలిపారు. ప్రపంచానికి ధ్యానం, యోగాను పరిచయం చేసిన ఘనత భారతీయులకే దక్కుతుందన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు-3 అట్టహాసంగా కొనసాగుతున్నాయి. శనివారం పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్ రెడ్డి, పత్రీజీ కూతురు పరిణతి పత్రిజీ, సీజీఆర్ చైర్మన్ లీలాలక్ష్మారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే పిరమిడ్‌ను సందర్శించి కొద్దిసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ధ్యాన, ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు లక్ష్మణ్ రావు, హన్మంత్ రావు, మాధవి, లక్ష్మీ, దామోదర్ రెడ్డి, సాంబశివరావు, బాలకృష్ణ, జయశ్రీ, రాంబాబు, శ్రీరామ్‌గోపాల్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, ప్రవాస భారతీయుడు డాక్టర్ లట్టుపల్లి రాకేశ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రామకృష్ణ, నర్సింహ్మ, సురేశ్, మాజీ సర్పంచ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో నియంత పాలన

- బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలి
- హామీల అమలులో రేవంత్ సర్కార్ విఫలం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలతో నియంతలా దేశాన్ని పాలించాలని బీజేపీ కుట్రలు చేస్తోందని, ప్రాంతీయ పార్టీల మనుగడకే ముప్పు వాటిల్లే ఈ ఎలక్షన్సను వ్యతిరేకించాల్సిన అవసరముందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. దేశంలోని రాష్ట్రాల పరిస్థితులు వేర్వేరుగా ఉంటాయని, పైగా అధికార వికేంద్రీకరణ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. రెండ్రోజులపాటు నిర్వహించే సీపీఎం 10వ జిల్లా మహాసభలు శనివారం ఇబ్రహీంపట్నంలో ప్రారంభమయ్యాయి. స్థానిక చౌరస్తాలో జరిగిన బహిరంగసభకు తమ్మినేని హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌ల మద్దతుతోనే కేంద్రంలో మోదీ ప్రభుత్వం నడుస్తోందని ఆయన అన్నారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పారిశ్రామికవేత్త అదానీ నుంచి ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.1700కోట్లు ముడుపుల ద్వారా లబ్ధిపొందారని అమెరికా ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ ఆయనపై చర్యలకు ఎందుకు వెనకాడుతున్నారంటూ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం అదానీని రక్షించేందుకే ప్రాధాన్యతనిస్తోందన్నారు. తెలంగాణలో గత, ఇప్పటి ప్రభుత్వాలు రూ.14 వేల కోట్ల పెట్టుబడులకు అగ్రిమెంట్లు చేసుకున్నాయని ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీల అమలులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందంటూ ఆయన విమర్శలు చేశారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలకు పోడు భూముల పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పడంతోపాటు దానికోసం సేకరించిన భూములను తిరిగి ఇచ్చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించారని, ఇప్పుడు దాని ఊసే లేదని మండిపడ్డారు. ఫార్మాసిటీ స్థానంలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తామని చెప్పి మరో 15 వేల ఎకరాలు సేకరించడానికి ఈ ప్రభుత్వం సిద్ధమైందని ఆయన అన్నారు. ఫార్మా విలేజ్ పేరుతో అభిప్రాయ సేకరణ సందర్భంగా లగచర్లలో రైతుల అరెస్టులను తాము తప్పుబట్టామన్నారు. తమకు సీటు, ఓట్లు ముఖ్యం కాదని పేద ప్రజల పక్షాన పోరే ప్రధానమన్నారు. ఈ మహాసభల్లో రాబోవు కాలంలో చేపట్టబోయే ఉద్యమాలు, కార్యాచరణపై తగు నిర్ణయాలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జాన్‌వెస్లీ, డీజీ నర్సింహారావు, జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్, నాయకులు పి.జంగారెడ్డి, పి.యాదయ్య, బి.మధుసూదన్‌రెడ్డి, బిసామేల్, కె.జగన్, డి.జగదీష్, సీహెచ్.జంగయ్య, కె.శ్రీనివాస్‌రెడ్డి, కవిత, సీహెచ్.బుగ్గరాములు, చింతపట్ల ఎల్లేష్, రావుల జంగయ్య, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

పాడైన రోడ్లపై ప్రయాణమెలా?

- గుంతలతో వాహనదారుల ఇక్కట్లు
- వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
- మరమ్మతులకు నోచని వైనం
- పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు



8

సమస్యలు పరిష్కరించాలి

- జిల్లావ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికుల ఆందోళన
- కనీస వేతనం అమలు చేస్తూ పర్మనెంట్ చేయాలని డిమాండ్



8

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కేశంపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని సీనియర్ నాయకుడు అబ్బి సుందరయ్య అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేని ప్రారంభించారు. యాప్‌లో దరఖాస్తు దారుల వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, నాయకులు చేవెళ్ల నర్సింహులు, తాండ్ర కృష్ణారెడ్డి, ప్రభాకర్‌జీ, అవంచ బాలరాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మేడి చెలిమ నుంచి మేడ్చల్‌గా..

(5వ పేజీ తరువాయి)

అన్ని విధాలుగా అచ్చుబడి వస్తుందని స్థానికులు అనడం గమనార్హం. నాలుగు తరాలుగా ఇక్కడ ఉన్న వారు ఈ ప్రాంతం విశిష్టత గురించి తమ రాబోయే తరాలకు చెప్పే ముందు మేడి చెలిమితో కథ ప్రారంభించి మేడ్చల్ అంటూ ముగించటం పరిపాటి. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగిన నానమ్మలు తమ ఇంట్లో పిల్లలకు ఊరు పుట్టుక గురించి కథలు చేపట్టం విశేషంగా మారింది.

పేరుకు పునాదులు ఇలా..

హైదరాబాద్ సామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్న గోల్కొండ ఖుతుబ్ షాహి రాజుల కాలంలో వ్యాపారం నిమితం ఉత్తర భారత దేశం నలుమూలల నుంచి వ్యాపారం చేయడానికి హైదరాబాద్ వచ్చే వ్యాపారస్తులు (కారోబార్‌లు) మేడ్చల్ ప్రాంతంలో విశ్రాంతి తీసుకునేవారు. ఈ మార్గం మేడ్చల్ పెద్ద చెరువుకు ఆనుకుని ఉండటంతో ఎడ్ల బండ్లలో వచ్చే వారు తమ బండ్లను చెరువు అంచుల్లో ఉన్న పెద్ద మేడి వృక్షం కింద ఆపి సేద తీర్చుకునే వారు. ఆ సమయంలో బాటసారులు తమ దాహం తీర్చుకోవడానికి మేడి చెట్టు సమీపంలోని చెరువు అంచుల్లో చెలిమలు తవ్వి కావాల్సిన మంచినీటిని సమకూర్చుకునేవారు. సేద తీర్చు కోవటానికి మేడి వృక్షం... దాహం తీర్చు కోవటానికి చెలిమి ఉండటంతో ఈ ప్రాంతంలోనే బాటసారులు సేద తీరేవారు. దీంతో ఈ ప్రాంతం విశ్రాంతి స్థావరంగా మారింది. హైదరాబాద్ వెళ్లి పని ముగించుకుని తిరుగు ప్రయాణం చేసేవారు తమ మార్గాన్ని సులువుగా గుర్తించడానికి మేడి చెట్టు చెలిమి అంటూ సంబోధించుకునే వారు. అనంతరం మేడి చెలిమి అంటూ సంబోధిస్తూ ఈ ప్రాంతానికి బాటసారులు తెలియకుండానే నామకరణం చేశారు. అనంతరం చెరువు అంచుల్లో నివాసాలు ఏర్పడి ఓ చిన్నపటి గ్రామం ఏర్పడింది. అప్పటి నుంచి ఇక్కడ జనజీవనం ప్రారంభమై అనంతరం కాలక్రమేపి చెరువు అంచుల్లో ఉన్న ఎడ్ల బండ్ల బాట.. చెరువు కట్టలా మారింది. అనంతరం రహదారుల అభివృద్ధిలో భాగంగా కట్ట పై నుంచి జాతీయ రహదారి నిర్మించి హైదరాబాద్ నుంచి దక్షిణ భారత దేశానికి రాక పోకలను సులువు చేశారు. దీంతో ఈ ప్రాంతం మెల్ల మెల్లగా అభివృద్ధి చెంది నిజాం పాలకుల హయాం నాటికి తాలూకా హోదాను పొందింది. అనంతరం హైదరాబాద్-నాందేడ్ రైల్వే మార్గం ఏర్పాటులో భాగంగా స్థానికంగా రైల్వే స్టేషన్ ఏర్పడటంతో అంచలంచెలుగా నేడు హైదరాబాద్ నగరానికి ఉత్తర ముఖద్వారంగా మేడ్చల్ నిలిచింది.



మేడ్చల్ పెద్ద చెరువు

రైళ్లలో గంజాయి, గోవా మద్యం పట్టివేత

- తాండూరులో 12 కిలోల గంజాయి, వికారాబాద్‌లో 95 బాటిళ్ల గోవా మద్యం పట్టివేత
- వివరాలు వెల్లడించిన వికారాబాద్ ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రైళ్లలో అక్రమంగా రవాణా చేస్తున్న గోవా మద్యాన్ని, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వికారాబాద్ ఎక్సైజ్ ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తాండూరు ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమల్ హసన్, ఎక్సైజ్ ఈఎస్ విజయ భాస్కర్, టాస్క్‌ఫోర్స్ ఆర్‌పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. శనివారం భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్తున్న కోనార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఒరిస్సాకు చెందిన శిలావతి ఆరు గంజాయి ప్యాకెట్లు కలిగి ఒక్కొక్క ప్యాకెట్లులో 2కిలోల చొప్పున 12కిలోల గంజాయిని గుర్తుతెలియని వ్యక్తి తాండూరు రైల్వేస్టేషన్ నుంచి బయటికి తెచ్చి పెట్టగా అట్టి గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా శుక్రవారం గోవా నుంచి జార్ఖండ్ వెళ్తున్న వాస్కోడిగామ రైల్లో 83లీటర్ల గోవా మద్యం 95రకాల బాటిళ్లు గుర్తుతెలియని వ్యక్తి రవాణా చేస్తుండగా బాటిళ్లను సీజ్‌చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను ఎవరన్నది ఇంకా గుర్తించలేదని ప్రయాణికులు సమాచారం ఇస్తే వారిని అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు పెద్దఎత్తున గంజాయి తరలుతోందని, గత వారం కిందట వికారాబాద్‌లో 28కిలోల గంజాయిని పట్టుకున్నామని తెలిపారు. అక్రమంగా గంజాయి, మద్యం తరలిపోకుండా నిఘా ముమ్మరం చేశామని తెలిపారు. ఈ సమావేశంలో తాండూరు ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్, టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్, వికారాబాద్ ఎస్‌హెచ్‌వో వీరాంజనేయులు, ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ తదితరులు ఉన్నారు.



తాండూరులో స్వాధీనం చేసుకున్న 12 కిలోల గంజాయి ప్యాకెట్లతో ఎక్సైజ్ పోలీసులు



చిన్నారితో మాట్లాడుతున్న పరిగి న్యాయాధికారిణి నాగుల శిల్ప

బాలసదనం సందర్శన

పరిగి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినీలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని పరిగి మున్సిఫ్‌కోర్టు న్యాయాధికారిణి నాగుల శిల్ప అన్నారు. పరిగిలోని బాలసదనాన్ని శనివారం ఆమె సందర్శించారు. బాలసదనంలో వంట గది, విద్యార్థులు నిద్రించే గదులను పరిశీలించారు. బాలికలతో మాట్లాడి బోధన తీరు వసతులు, సమస్యలను ఆరాతీశారు. ఈ సందర్భంగా న్యాయాధికారిణి మాట్లాడుతూ.. బాలికలకు మంచి ఆహారం, బోధన అందించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు లేకుండా వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్‌ఎయిడ్ న్యాయవాది గౌస్‌పాష, కోర్టు సిబ్బంది మోహన్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో లబ్ధి పొందాలి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందే స్తోమతలేని పేదలు సీఎం సహాయనిధితో లబ్ధిపొందాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులోని పలువురు లబ్ధిదారులకు బోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ టీఆర్‌ఎస్ నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

తాండూరులో చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు

తాండూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాండూరు చెస్ ఛాంపియన్ షిప్ -2020-24 అండర్-14, అండర్-16 పోటీలను శనివారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 800మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 16 చెస్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌గా ముతసీమ్ (సెయింట్ మార్క్స్ హైస్కూల్), రన్నర్‌గా సాయి చరణ్ బాబు (విశ్వవేద పాఠశాల) ఎంపికయ్యారు. అండర్-14లో విన్నర్‌గా షేక్ ఇబ్రహీం (నాగార్జున పాఠశాల), రన్నర్‌గా భవానీ శంకర్ (నేతాజీ గురుదేవ్ పాఠశాల) విద్యార్థులు ఎంపికయ్యారు. విజేతలుగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్పీఎల్ ఎండీ సరళ శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్‌లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు రవీందర్ రెడ్డి హాజరు కాగా హిందూ ధార్మిక పరిషత్ కన్వీనర్ గాజుల బస్వరాజ్ అధ్యక్షతన వహించారు.



చెస్ విజేతలకు షీల్డ్ అందజేస్తున్న ఆర్పీఎల్ ఎండి. సరళ శ్రీనివాస్‌రెడ్డి



ఆడుతున్న విద్యార్థులు

శనీశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని మదనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల ఏకశిలా విగ్రహం, శ్రీ శనీశ్వరస్వామి ఆలయాన్ని శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ప్రకాశ్‌గౌడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, గణేశ్ గుప్తా, నార్సింగ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, కౌన్సిలర్‌లు శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు దండు ఇస్తారి, జగన్‌గౌడ్, రమేశ్‌యాదవ్, భిక్షపతి, నరేందర్‌గౌడ్, రామ్‌నాథ్, నీళ్ల శ్రీధర్‌గౌడ్, రమేశ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



శనీశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



దీక్షలో జేఏసీ నాయకులు

మండల కేంద్రం ఏర్పాటుకు పోరాటం ఉధృతం

తలకొండపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు గట్టిప్పలపల్లి గ్రామస్థులు పోరాటం ఉధృతం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడికి నిరసనగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం సాగిస్తామని జేఏసీ నాయకులు ఉద్ఘాటించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 58వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ సంఘాల నేతలు కూర్చున్నారు. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలు చొరవ తీసుకోవాలన్నారు. జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్లు శరత్‌చంద్ర, అంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్, నాయకులు రాజశేఖర్, కృష్ణయ్య, చెన్నయ్య, నిరంజన్, అంజయ్య, లక్ష్మణ్ నాయక్, రాజునాయక్, అల్లావుద్దీన్, శరత్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ సేవలు చిరస్మరణీయం

మేడ్చల్ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి మాజీ సీఎల్పీ నేత, పి.జనార్ధన్‌రెడ్డి(పీజేఆర్) అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు పీజేఆర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద పీజేఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ కొడె మహేస్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు పాటుపడాలి



సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తలకొండపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుకు తోడు దాతలు చేయూతనందించేందుకు ముందుకు రావాలని పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ కండె ఓంకారం, మార్కెట్ డైరెక్టర్ అజీమ్‌లు పిలుపు నిచ్చారు. తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ సందడి నరేందర్ రెడ్డి రూ25 వేలతో పది సీలింగ్ ఫ్యాన్లు సమకూర్చారు. శనివారం లయన్స్‌క్లబ్ సభ్యులతో కలిసి వారు ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, క్రాంతికుమార్, ఝాన్సీలక్ష్మి, రాజేశ్వర్‌రెడ్డి, కబీర్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

100మీటర్ల పరుగులో రాష్ట్రస్థాయికి ఎంపిక


సాయి సుదిష్ణను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

తాండూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తాండూరులోని భాష్యం కళాశాలలో ఎంఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న సాయి సుదిష్ణ ఇటీవల జరిగిన సీఎం కప్ పోటీల్లో 100 మీటర్ల పరుగులో జిల్లాస్థాయి బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా సాయి సుదిష్ణను, ఆమె తల్లిదండ్రులను శనివారం కళాశాల యజమాన్యం సన్మానించింది. సాయి సుదిష్ణ క్రికెట్‌లో కూడ రంగారెడ్డి జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తూ 68వ ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ఆడనుంది. తాండూరు నుంచి బూస్ట్ స్కాలర్‌షిప్ సాధించి క్రికెట్ దిగ్గజం రవిశాస్త్రి అకాడమిలో క్రికెట్ కోచింగ్ తీసుకుంటోంది. ఫాస్ట్‌బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. సాయి సుదిష్ణను శనివారం కళాశాల కరస్పాండెంట్ పర్యాద రామకృష్ణ, అధ్యక్షురాలు అనురాధ రమేష్, ప్రిన్సిపల్ సోమనాథ్, అధ్యాపకులు సన్మానించారు.

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు


పైకప్పు నుంచి ఊడిన పెచ్చులను చూయిస్తున్న హెచ్ఎం కీర్తి

కొడంగల్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని హస్నాబాద్ ప్రాథమిక పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందారు. తరగతి గదుల్లో శనివారం ఒక్కసారిగా పైకప్పు పెచ్చులూడి పడటంతో విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. పాఠశాల శిథిలావస్థకు చేరిందని, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని హెచ్ఎం కీర్తి వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు టి.భీములు తదితరులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలి

వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి


ధారూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీచేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

ధారూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధారూరు పోలీసు సర్కిల్‌పరిధిలోని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ధారూరు సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేసిన అనంతరం పోలీసు అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడకుండా వారిపై దృష్టి సారించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్టిలో ఉంచుకుని సిబ్బంది గ్రామాల్లో ప్రత్యేక దృష్టిపెట్టాలని, అలజడులు సృష్టించి శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీకెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన సీఐ కార్యాలయం, పోలీసుస్టేషన్‌లలో పలు రికార్డులను తనిఖీచేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రఘురాం, ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ ఉన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు వంశీ నివాళి


పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న వంశీచంద్ రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, దివంగత మన్మోహన్ సింగ్ మృతి పట్ల సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో మన్మోహన్‌సింగ్ పార్థివదేహాన్ని శనివారం సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. దేశానికి మన్మోహన్ సింగ్ అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని వంశీ అన్నారు. మన్మోహన్ మృతితో దేశం గొప్ప వ్యక్తిని కోల్పోయిందన్నారు. ఆయన సేవలను దేశం ఎప్పుడూ గుర్తించుకుంటుందని కొనియాడారు.

నెర్రెలు బారిన రోడ్డు



కేశంపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సంగెం-నుంచి వేముల్‌నర్వ ప్రధాన రోడ్డును ఇటీవల విస్తరించారు. సంగెం నుంచి వేముల్‌నర్వ వరకు రోడ్డును బాగానే వేశారు. అయితే, సంగెం గ్రామ సమీపంలో రోడ్డు వేసే సమయంలో సరైన ప్రమాణాలు పాటించారో.. లేదో! కానీ, దాదాపు 100 మీటర్ల వరకు రోడ్డు నెర్రెలు బారింది. దాంతో రోడ్డు కుంగిపోయింది. వాహనదారులు గమనించకుండా వెళుతుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

యాసంగి వరి నాట్లు ముమ్మరం


చిన్నతూండ్లలో వరి నాట్లు వేస్తున్న రైతులు

యాచారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలంలో యాసంగి వరినాట్లు జోరందుకున్నాయి. యాచారం,. చిన్నతూండ్ల, నందివనపర్తి, కొత్తపల్లి, మంతన్‌గౌరెల్లి, చింతపట్ల తదితర గ్రామాలలో ఇప్పటివరకు 135 ఎకరాలలో నాట్లు వేశారు. నీటి కొరత ఏర్పడకుండా, వడగండ్ల బారిన పడకుండా రైతులు ముందస్తుగా నాట్లు వేయిస్తున్నారు. నీటి కొరత ఏర్పడకుండా కొందరు రైతులు బోర్లను డ్రిల్ చేయిస్తున్నారు. యాచారం సొసైటీ అధికారులు ఎరువులను సిద్ధంగా ఉంచారు. ఆధార్, పాస్‌బుక్ లేకుండా ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వొద్దని వ్యవసాయ అధికారులు వ్యాపారులకు సూచనలు చేశారు. మండలంలో 3680 ఎకరాలలో వరి సాగు అయ్యే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ పేర్కొన్నారు.

కొండను పిండేస్తున్నారు!

- గిరిగేట్‌పల్లి ప్రాంతాల్లో అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు
- యథేచ్ఛగా అక్రమార్కుల ఆగడాలు
- గిరిగేట్‌పల్లిలో కనుమరుగైన పెద్దగుట్ట
- చుట్టుపక్క గ్రామాల్లోనూ ఇదే తంతు
- వ్యాపారం మొత్తం చీకటి దందానే
- తవ్వకాలు జరిపే ప్రాంతాలకు ఎవరూ రాకుండా గస్తీ


ధన్నారం సమీపంలో పోలీసులు పట్టుకున్న లారీలు, టిప్పర్

వికారాబాద్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టికి బయట మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దాన్ని వ్యాపారంగా మార్చుకున్న అక్రమార్కులు చీకటి పడితే చాలు ఎర్రమట్టి కొండలను తవ్వేస్తున్నారు. అర్ధరాత్రి మొదలు తెల్లవారుజాము వరకు గుట్టలను తొడేస్తూ లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని చుట్టూరా ఈ వ్యాపారం మూడు పూలు.. ఆరు కాయాలుగా కొనసాగుతోం ది. వీరికి కొందరు అధికారులు, రాజకీయ నాయకుల అండదండలున్నాయన్న చర్చ స్థానికంగా సాగుతోంది. అందువల్లే వారిని అడిగే వారు లేరన్న ధీమాతో అక్రమారుకలు ధనార్జనే ధ్యేయంగా మట్టిని తరలిస్తున్నారు. గిరిగేట్‌పల్లి, మద్గుల్ చిట్టంపల్లి, సిద్దులూరు, ధన్నారం, కోటాలగూడ, బురాంతపల్లితో పాటు చుట్టు పక్కల చాలా గ్రామాల్లో ఎర్రమట్టి దందాను అక్రమార్కులు కొనసాగిస్తున్నారు.

అసైన్డ్ భూముల్లో అక్రమ వ్యాపారం

గిరిగేట్‌పల్లి గ్రామంలో అసైన్డ్ భూముల్లో వ్యాపారులు అక్రమ వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో ఉన్న కొండను పూర్తిగా తొలగించి రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ వ్యాపారం కొనసాగుతుండగా ప్రస్తుతం ఆ ప్రాంతం మొత్తం ఎర్రమట్టి లోయలను తలపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే అసైన్డ్ భూమిలో రైతుకు రూ.200 చొప్పున టిప్పర్‌కు చెల్లించి వ్యాపారులు బయటి మార్కెట్‌లో వేల రూపాయలకు విక్రయిస్తున్నారు.

రాత్రి దందా..

గిరిగేట్‌పల్లిలో ఇద్దరు రైతులకు చెందిన 5.20ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంతకాలంగా అక్రమంగా మట్టిని తోడేస్తున్నారు. రాత్రి 12 గంటలకు మొదలు తెల్లవారుజామున నాలుగు గంటల వరకు ఈ వ్యాపారం జరుగుతోంది. దీనికి ఒక ప్రణాళిక వేసుకుని పోలీసులు మీడియా, ఇతర అధికారులు గ్రామంలోకి వచ్చే మార్గాల్లో గస్తీ నిర్వహించి ఎవరూ రాకుండా వ్యాపారం చేస్తున్నారు. కింది స్థాయి అధికారులు ఎవరైనా వచ్చిన వారికి నయానో భయానో చేతులు తడిపి పంపిస్తుండడంతో వారి వ్యాపారం కొద్ది రోజుల్లోనే లక్షలు దాటింది.

గిరిగేట్‌పల్లి అంటేనే ఎర్రమట్టి వ్యాపారం

వికారాబాద్ మునిసిపాలిటీలో ఉన్న గిరిగేట్‌పల్లి గ్రామం అంటేనే ఎర్రమట్టి దందాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అయినా, అధికారుల్లో చలనం రావడం లేదు. కొంత కాలంగా అక్కడ ఎర్రమట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. గతంలో అక్కడ ఏర్పాటు చేసిన ఓ ఫంక్షన్ హాల్‌కు సైతం గ్రామస్తులు అంతా కలిసి ఎర్రమట్టిని తవ్వి అమ్ముకున్నారు. అలా ఒక్కొక్కరు ఎర్రమట్టిని గ్రామం చుట్టూ ఉన్న కొండను తవ్వి పట్టణంలోని వెంచర్లకు, చుట్టుపక్కల గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకోవడం చేస్తూ వస్తున్నారు.

ఎర్రమట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

ధన్నారం శివారులో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న వారిపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. ఏడుగురు వ్యక్తులను పట్టుకుని రెండు లారీలు, ఒక టిప్పర్‌ను ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ ఆంజనేయులు తెలిపారు.

మట్టి టిప్పర్లు, జేసీబీని పట్టుకున్నాం

అర్ధరాత్రి మట్టి కొడుతున్నారని సమాచారం రావడంతో గిరిగేట్‌పల్లి గ్రామానికి వెళ్లి ఎర్రమట్టి కొడుతున్న టిప్పర్ లారీలను, జేసీబీని పట్టుకున్నాం. వికారాబాద్ చుట్టుపక్కల గ్రామాల్లో సైతం ఎర్రమట్టి కొడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అలాంటి వారిని ఉపేక్షించేది లేదు. మూడురోజుల క్రితం కూడా మండలంలో ఎర్రమట్టి కొడుతున్న వాహనాలను పట్టుకున్నాం. అనుమతులు లేకుండా ఎర్రమట్టి కొడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

- వికారాబాద్ సీఐ భీంకుమార్

ఇండస్ట్రియల్ కారిడార్ కోసం అధికారుల సర్వే


రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

బొంరాస్‌పేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండల పరిధిలోని లగచర్లలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ కారిడార్ కోసం అధికారులు శనివారం సర్వే నిర్వహించారు. హకీంపేట్ పరిధిలోని 252 సర్వే నెంబరులో లావని పట్టాల సర్వే నిర్వహించినట్లు దుద్యాల, కొడంగల్ తహసీల్దార్లు కిషన్, విజయ్‌కుమార్ తెలిపారు. రైతులతో సమావేశం నిర్వహించి సోమవారం నుంచి ఫీల్డ్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. 252 సర్వే నెంబరులో పట్టాదారులు తమ హద్దులు చూయించాలని రైతులతో కోరారు.

స్వల్పంగా పెరిగిన కందుల ధరలు

ధారూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన వ్యవసాయ ఉత్పత్తుల బీట్లలో కందుల ధరలు స్వల్పంగా పెరిగాయి. గతవారం కందులు ధరలు పడిపోగా ఈవారం కొంతమేర కందులు ధరలు పెరిగాయి. కందులు క్వింటాలుకు రూ.8,050ల నుంచి, రూ.8,210వరకు ధర పలికాయి. కాగా గతవారం క్వింటాలుకు రూ.7,300ల నుంచి రూ.7,775వరకు ధరలు పలికాయి. క్వింటాలుకు రూ.435లు ధర పెరిగింది. ధాన్యం క్వింటాలుకు రూ.2,200ల నుంచి రూ.2,280ల వరకు సోనామసూరి రకం క్వింటాలుకు రూ.2,440ల నుంచి రూ.2,630ల వరకు ధరలు పలికాయి. మార్కెట్‌లో ధాన్యం 555క్వింటాళ్లు, కందులు 190క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ సహాయ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే 'ఫార్మాసిటీ' రైతులకు ఇంటిస్థలాలు

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి


మీర్కాన్‌పేటలో హెచ్ఎండీఏ వెంచర్‌లో రైతులతో మాట్లాడుతున్న సబితారెడ్డి

కందుకూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఫార్మసిటీ ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు భూములు ఇచ్చారని.. ముందు చూపుతోనే వారికి ఎకరం భూమికి గుంట చొప్పున ఇంటి స్థలాలను అన్ని అంగులతో అభివృద్ధి చేసి ఇచ్చినట్లు మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. అనంతరం మీర్కాన్‌పేట రెవెన్యూ పరిధిలోని 600 ఎకరాలలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న వెంచర్ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఆదేశానుసారం కందుకూరు, యాచారం మండలాలలో సుమారు 14వేల ఎకరాల భూమిని ఫార్మసిటీ కోసం సేకరించినట్లు చెప్పారు. రైతులకు పరిహారం మంజూరు చేసి భూసేకరన పూర్తిచేసినట్లు గుర్తు చేశారు. అయితే, రైతులు విలువైన భూములు ఇచ్చారని.. వారికి ఎలాంటి నష్టం కలగకుండా ఎకరం భూమి కింద గుంట(121గజాల) ఇంటి స్థలాన్ని కేటాయించడానికి మీర్కాన్‌పేట, పంజగూడ, తిమ్మాయపల్లి రెవెన్యూలో 600 ఎకరాలను కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే రైతులకు ఇంటి స్థలానికి సంబంధించిన పత్రాలను అందజేసినట్లు చెప్పారు. రైతులు ఐదేళ్ల తరువాత స్థలాలను అమ్ముకునే హక్కులు కల్పించాలని అనుకున్నట్లు సబితాఇంద్రారెడ్డి తెలిపారు. కానీ, కొందరు రియల్ వ్యాపారులు అమాయక రైతులను ఆసరా చేసుకొని తక్కువ ధరలకే కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఐదేళ్లలో ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, రైతులు ప్లాట్లను అమ్ముకోవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు కందుకూరు మండంలోని ముచ్చర్ల, మీర్కాన్‌పేట, పంజగూడ, సార్లరావులపల్లి, తిమ్మాయపల్లి, గ్రామాలకు చెందిన రైతులకు 1,560 మందికి ఇంటి స్థలాలకు సంబంధించిన పత్రాలను అందజేసినట్లు గుర్తు చేశారు. ఆయా పత్రాల ఆధారంగా ప్లాట్‌నెంబర్లు వేయాలని ఆర్డీవోను కోరినట్లు సబితారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కాకి ఇందిర, రజిత, బి.నరేందర్‌గౌడ్, డిల్లీ గణేష్, మాజీ ఎంపీటీసీ కాకి రాములు, డైరక్టర్ పొట్టి ఆనంద్, నాయకులు యన్నె జయేందర్‌రెడ్డి, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ, ఎలుక మేఘనాథ్‌రెడ్డి, టి.దేవేందర్, ప్రవీణ్‌నాయక్, జంగయ్య, తిరుపతయ్య, బొక్క దీక్షిత్‌రెడ్డి, భీమ్‌నాయక్, మహిపాల్, కృష్ణ, ఎగ్గిడి గణేష్, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గోపాల్‌రెడ్డి తదితరులు

నూతన మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలి

కలెక్టర్‌కు చిలుకూరు గ్రామస్థుల వినతి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏడు గ్రామాలను కలిపి నూతనంగా ఏర్పాటు చేస్తున్న మొయినాబాద్ మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు గున్నాల గోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు చిలుకూరు గ్రామస్థులతో కలిసి శనివారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గోపాల్‌రెడి మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న మొయినాబాద్ మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరుపెట్టాలని, మున్సిపాలిటీలో విలీనం అవుతున్న ఏడు గ్రామాల్లో చిలుకూరు గ్రామం పెద్దదని, జనాభా, రెవెన్యూ పరంగానూ మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు చిలుకూరు గ్రామ పరిధిలో ఉన్నాయన్నారు. బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం కూడా గ్రామ పరిధిలో ఉందని వివరించారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని నూతన మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ సహదేవ్‌గౌడ్, శ్రీరాములు ముదిరాజ్, మహేష్ చారి, మాల్లారెడ్డిలు ఉన్నారు. కాగా, ఈ విషయమై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కూడా వారు కలిశారు.

ఏడేళ్లయినా పూర్తికాలే!


అర్థంతరంగా నిలిచిన ఐసీడీఎస్ అదనపు భవన నిర్మాణం

చేవెళ్ల. డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ అలసత్వం కారణంగా చేవెళ్ల మండల కేంద్రంలో చేపట్టిన ఐసీడీఎస్ అదనపు భవన నిర్మాణ పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. ఈ కార్యాలయ అధికారులు, సిబ్బంది సమావేశాలు నిర్వహించుకునేందుకు గత ప్రభుత్వం అదనపు భవనం మంజూరు చేసింది. దీని నిర్మాణానికి జెడ్పీ నిధుల నుంచి రూ.5లక్షలు కేటాయించింది. మొదట్లో పనులు వేగవంతంగా జరిగినా.. ఆ తర్వాత నిధులు సరిపోలేదు. దీంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశాడు. ఏడేళ్లుగా భవన నిర్మాణం నిలిచిపోయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి మొండి గోడలతో దర్శనమిస్తున్న ఐసీడీఎస్ కార్యాలయ భవనాన్ని పూర్తిచేయాలని ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు.

రాష్ట్రంలో అత్యుత్తమ క్రీడా పాలసీ

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


అర్జున్ మురళిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా ఫోర్త్‌సిటీలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పంజాబ్‌లోని టూధియానాలో నిర్వహించిన జాతీయ కరాటే చాంపియన్‌షిప్ అండర్-14 పోటీల్లో ఆమనగల్లు మున్సిపాలిటీ నగారాగడ్డ తండాకు చెందిన అర్జున్ మురళి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రజక పతకం సాధించాడు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం అర్జున్ మురళిని సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. జాతీయ స్థాయిలో విజయం సాధించడం తెలంగాణకు గర్వకారణమని కసిరెడ్డి అన్నారు. క్రీడాకారుని తండ్రి మురళి మోహన్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, ఆమనగల్లు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మానయ్య, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రమేశ్‌గౌడ్, తదితరులున్నారు. అలాగే ఆమనగల్లు పట్టణంలో దివంగత కేంద్ర మాజీమంత్రి సూదిని జైపాల్ రెడ్డి, మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి, మాజీ ప్రధాని మన్మోన్ సింగ్‌ల విగ్రహాల ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం అందజేయగా అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

రెవెన్యూ సమస్యలను నిర్లక్ష్యం చేయెుద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను నిర్లక్ష్యం చేయెుద్దని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు భూమి లభ్యత ప్రతిపాదనలు, పాత ధాన్యంసేకరణ, ధాన్యం నిలువ చేసిన భవనాలు, ఓఆర్సీ 38 ఈ, ధరణి పెండెన్సీ తదితర అంశాలపై శనివారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మండల తహసీల్దార్లు, రెవెన్యూ సంబంధిత సూపరింటెండెంట్‌లతో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ధరణిలో ఎలాంటి పెండింగ్‌లు ఉండకుండా ఫైల్స్ క్లియరెన్స్ చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అలాంటి వారిపై చర్యలు తప్పవని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి గుర్తించబడిన భూముల వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు నిర్మాణాలకు సంబంధించిన భూములను గుర్తించడంతో పాటు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను సమర్పించాలని అధికారులకు సూచించారు. విద్యాసంస్థలకు పంపించే బియ్యం లభ్యత, నాణ్యతను, బియ్యం నిల్వ చేసే గోదాంలను, చౌకధర దుకాణాలను తనిఖీలు చేసి ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామ్ రెడ్డి, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు


కులకచర్ల మండలం అంతారంలో ఇటుకు బట్టీ దగ్గర యజమాని, కూలీలతో మాట్లాడుతున్న పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి

కులకచర్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిల్లలను పనుల్లో పెట్టుకుంటే ఇటుకబట్టి యజమానులపై కేసులు నమోదు చేస్తామని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలో కొనసాగుతున్న ఇటుక బట్టీలను శనివారం ఆయన తనిఖీ చేశారు. యజమానులు, కూలీలతో సీఐ మాట్లాడారు. బడీడు పిల్లలు ఉంటే వివరాలు తెలియజేయాలని వారి కోసం ప్రత్యేక బడుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే ఇటుక బట్టి యజమానులకు, కూలీలకు అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. కూలీలు తమ పూర్తి వివరాలను పోలీస్‌స్టేషన్‌లో అందించాలని సూచించారు. ఇటుక బట్టి నిర్వాహణకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తప్పకుండా పొందాలన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి ఉన్నారు.



రాజునాయక్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఏఐసీఆర్‌యూ ప్రతినిధులు

మాజీ సర్పంచ్‌కు డాక్టరేట్

సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అందజేత

యాచారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివనపర్తి మాజీ సర్పంచ్ వి.రాజునాయక్ చేసిన సేవా కార్యక్రమాలకు గాను తమిళనాడుకు చెందిన ఏషియన్ ఇంటర్‌నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈమేరకు శనివారం వర్సిటీలో ప్రతినిధులు అందజేశారు. కాగా, నందివనపర్తి మాజీ సర్పంచ్ వి.రాజునాయక్ చేసిన సేవా కార్యక్రమాలను యూనివర్సిటీ ప్రతినిధులు నందివనపర్తిలో పలుమార్లు పర్యటించి విచారణ చేసి డాక్టరేట్ అందించారు. ఆయన ప్రస్తుతం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నట్లు చెప్పారు. డాక్టరేట్ తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

యాచారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తాటిపర్తి, గున్‌గల్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల నరికివేత, సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా నేడు(ఆదివారం) ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు చెప్పారు. రైస్‌మిల్లులు, పెట్రోల్‌బంకుల నిర్వాహకులు, డెయిరీ పరిశ్రమల యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్.. పేదలకు వరం

తలకొండపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంగా నిలుస్తుందని ఏఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబాజీలు అన్నారు. వెల్జాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం గ్రామంలో అందజేశారు. అజీజ్, నర్సింహులు, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, అశోక్, వెంకటరమణారెడ్డి, ఆరిఫ్, తదితరులున్నారు.

పాడైన రోడ్లపై ప్రయాణమెలా?

- గుంతలతో వాహనదారుల ఇక్కట్లు
- వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు



కంకర తేలిన కిషన్‌నగర్ నుంచి విఠ్యాల వెళ్లే రోడ్డు



కోసుకుపోయిన పరిగి ఆర్‌అండ్ బీ రోడ్డు నుంచి కిషన్‌నగర్ వెళ్లే బీటీ రోడ్డు

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల రహదారులు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోడ్ల నిర్మాణంలో భాగంగా దశాబ్దాల క్రితం కంకర వేసి మరిచారు. నేటికీ కనీసం మరమ్మతులు చేయకపోవడంతో కంకర తేలి కాలినడకన వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల రోడ్డు వర్షానికి కోసుకుపోయి కాలువలను దర్శనమిస్తున్నాయి. వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురౌతున్నారు. కంకర పూర్తిగా లేచిపోయి కనీసం కాలిబాటన కూడా నడవలేని విధంగా ఉన్నాయి. కనీసం మట్టి పోయించి మరమ్మతులు చేపట్టాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కిషన్‌నగర్-విఠ్యాల రోడ్డుపై తేలిన కంకర

కిషన్‌నగర్ నుంచి విఠ్యాల వరకు సుమారు 4 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సుమారు 30 ఏళ్ల క్రితం కంకర రోడ్డు వేశారు. ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

అధ్వానంగా రామేశ్వరం రోడ్డు

పవిత్ర పుణ్యక్షేత్రమైన రామేశ్వరం రోడ్డు కూడా బీటీ తేలిపోయి అధ్వానంగా మారింది. జాతీయ రహదారి రాయికల్ గేట్ నుంచి రామేశ్వరం-విఠ్యాల వరకు బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. కొన్నిచోట్ల మట్టి రోడ్డును తలపిస్తోంది. అడుగడుగునా గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. మలుపుల వద్ద గోతులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జోగమ్మగూడ శివారులో రోడ్డు చాలా ప్రమాదకరంగా మారి మట్టి రోడ్డును తలపిస్తోంది. నిత్యం రామేశ్వరం శివాలయానికి అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్తుంటారు. అయినా రోడ్డు మరమ్మతులకు నోచుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



పాడైపోయిన రామేశ్వరం విఠ్యాల రోడ్డు

ప్రమాదకరంగా పరిగి-కిషన్‌నగర్ రోడ్డు

పరిగి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కిషన్‌నగర్ వెళ్లే బీటీ రోడ్డు ఇరువైపులా కోసుకుపోయి ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చేందుకు ద్విచక్రవాహనాలు కిందికి దిగితే మళ్లీ రోడ్డుపైకి రావాలంటే ఇబ్బందులు పడాల్సిందే. వర్షానికి రోడ్డుకిరువైపులా మట్టి కొట్టుకుపోవడంతో రోడ్డు కూడా కోసుకుపోయింది. దాంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకిరువైపులా మట్టిపోస్తే కొంత వరకు ప్రమాదాలను అరికట్టవచ్చని వాహనదారులు, గ్రామస్తులు చెబుతున్నారు.

రోడ్డు మీదుగా వెళ్లలేక పోతున్నాం



కిషన్‌నగర్ నుంచి విఠ్యాల వెళ్లే రోడ్డుకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోడంతో కంకర పూర్తిగా తేలిపోయింది. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. 4 కిలోమీటర్ల ప్రయాణం నరకప్రాయంగా మారింది. మరమ్మతులు చేపట్టాలి.

- అంజనేయులు, కిషన్‌నగర్

మరమ్మతులు చేపట్టాలి



రామేశ్వరం విఠ్యాల రోడ్డు పాడై అధ్వానంగా మారింది. రాత్రి వేళల్లో గ్రామానికి వెళ్లాలంటే భయమేస్తుంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రీబీటీ చేయాలి. లేకపోతే మరమ్మతులైనా చేపట్టాలి.

- అంజయ్య, విఠ్యాల గ్రామం

(5వ పేజీ తరువాయి)

రోడ్డుగా ఉండటంతో నిత్యం ఎన్నో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. రోడ్డు విస్తరణకు కేంద్ర మంత్రి గడ్కారి శంకుస్థాపన చేసి 30 నెలలు దాటినా సర్వేలు, భూసేకరణ పనులకే పరిమితమయ్యాయి. ఈ రహదారి దూరం 46 కిలో మీటర్లు కాగా.. 290 గుంతలు, 25 పెద్ద గుంతలు, 265 చిన్న గుంతలు, 66 మలుపులు, 19 డేంజర్ స్పాట్లు ఉన్నాయి. చేవెళ్ల మండలం ఆలూరు గేట్ వద్ద డిసెంబరు 2న రైతులపైకి లారీ దూసుకెళ్లిన ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడిన విషయం విధితమే. జిల్లా వ్యాప్తంగా మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 430 మంది మరణించారు. అత్యధికంగా ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల పరిధిలో మృతుల సంఖ్య అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తుంది.

క్రైం రన్!

ఆగని హత్యలు, అత్యాచారాలు

మహిళ, ఆడపిల్లల రక్షణకు ఎన్ని చట్టాలు తెచ్చినా ఫలితం లేకుండా పోతుంది. వారిపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జిల్లాలో గత ఏడాది హత్యలు, అత్యాచారాలకు సంబంధించిన కేసుల సంఖ్య కాస్త తగ్గినప్పటికీ.. మళ్లీ ఈ ఏడాది పెరిగాయి. పోయిన సంవత్సరం 29 హత్య కేసులు నమోదు కాగా, ఈ సారి 36 కేసులు నమోదయ్యాయి. అందులో చేవెళ్ల డివిజన్‌లో 6, ఇబ్రహీంపట్నం పరిధిలో 7, మహేశ్వరంలో 2, షాద్‌నగర్‌లో అత్యధికంగా 8 హత్య కేసులు నమోదయ్యాయి. హత్యాచారాలకు సంబంధించి గత ఏడాది 112 కేసులు నమోదు కాగా, ఈ సారి ఆ సంఖ్య 116కు చేరింది. అత్యధికంగా చేవెళ్ల డివిజన్ పరిధిలో 41, అత్యల్పంగా తలకొండపల్లిలో ఒక కేసు నమోదైంది. ఆ తర్వాత షాద్‌నగర్ పరిధిలో 16, ఇబ్రహీంపట్నలో 16 కేసులు నమోదు కావడం భయాందోళన కలిగిస్తుంది. మహేశ్వరంలో 4, కందుకూరులో 3 కేసులు నమోదయ్యాయి.

తగ్గిన దోపిడీలు..

గత ఏడాది కంటే ఈ సారి దోపిడీ కేసుల సంఖ్య చాలా వరకు తగ్గింది. గత సంవత్సరం 179 దోపిడీ కేసులు నమోదు కాగా... ఈసారి 35 కేసులు నమోదయ్యాయి. అందులో ఇబ్రహీంపట్నంలో పరిధిలో అత్యధికంగా 12, షాద్‌నగర్‌లో 8 కేసులు నమోదయ్యాయి. మిగితా పోలీస్‌స్టేషన్లలో ఒకటి రెండు చొప్పున నమోదయ్యాయి.

రెచ్చిపోయిన దొంగలు..

జిల్లా వ్యాప్తంగా రూరల్ పరిధిలో మొత్తం దొంగతనాల కేసులు 1055 నమోదు కాగా, అందులో అత్యధికంగా చేవెళ్ల డివిజన్ పరిధిలో 306 కేసులున్నాయి. తర్వాత ఇబ్రహీంపట్నం పరిధిలో 257, శంషాబాద్ ఎయిర్‌పోర్టు పీఎస్ పరిధిలో 148, శంషాబాద్ పీఎస్ పరిధిలో 110, మహేశ్వరంలో 53, కందుకూరులో 20, షాద్‌నగర్‌లో 70 కడ్తాల్‌లో 44, తలకొండపలల్లిలో 21 కేసులున్నాయి.

మిస్టరీగా మిస్సింగ్స్..

మిస్సింగ్ కేసులు పెరిగి పోతున్నాయి. చాలా వరకు కేసులు మిస్టరీగానే మారుతున్నాయి. 2024లో 771 మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో మహిళలే ఎక్కువగా ఉన్నారు. గత ఏడాది 852 మిస్సింగ్ కేసులు నమోదు కాగా, ఈసారి సంఖ్య పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో 771 మిస్సింగ్ కేసులు నమోదు కాగా అధికంగా ఇబ్రహీంపట్నం పరిధిలోనే 217, చేవెళ్ల డివిజన్‌లో 194 కేసు లు నమోదయ్యాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిధిలో 126 కేసులు, కడ్తాల్‌లో 28, తలకొండపల్లిలో 14, ఆమనగల్లులో 19, షాద్‌నగర్ 42, మహేశ్వరం 38, శంషాబాద్ పీఎస్ పరిధిలో 70 కేసులు నమోదయ్యాయి.

పెరిగిన లైంగిక వేధింపులు, ఆత్మహత్యలు

మహిళలపై లైంగిక వేధింపులు గత ఏడాది కంటే ఈసారి మరింతగా పెరిగాయి. గత ఏడాది జిల్లాలో 125 కేసులు నమోదు కాగా, ఈసారి ఆ సంఖ్య 207కు చేరుకుంది. అందులో చేవెళ్ల డివిజన్‌లో అత్యధికంగా 81, ఇబ్రహీంపట్నంలో 31, షాద్‌నగర్‌లో 23 కేసులు నమోదయ్యాయి. ఆమనగల్లులో 10 కడ్తాల్‌లో 6, తలకొండపల్లిలో 2, శంషాబాద్ ఆర్‌జీఐఏ పరిధిలో 17, శంషాబాద్‌లో 20, మహేశ్వరంలో 13, కందుకూరులో 4 కేసులు నమోదయ్యాయి. అలాగే వివిధ కారణాలతో గతేడాది 59 మంది ఆత్మహత్య చేసుకోగా, ఈసారి ఈ సంఖ్య 344కు చేరుకుంది. అత్యధికంగా ఇబ్రహీంపట్నంలో పరిధిలో 113 మంది, చేవెళ్లలో 74, షాద్‌నగర్‌లో 47, శంషాబాద్‌లోని రెండు పీఎస్ పరిధిల్లో 51, మహేశ్వరంలో 10, కందుకూరులో 12, కడ్తాల్‌లో 14, తలకొండపల్లిలో 16, ఆమనగల్లులో 7 కేసులు నమోదయ్యాయి.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప మహాపడిపూజ



మహేశ్వరం : పూజలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ గంట వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామి మహాపడి, ఇరుముడిపూజ భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మహేశ్వరంలో నూతనంగా అయ్యప్ప స్వాములు సన్నిధానం కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా తుమ్మలూరు ప్రాంతం అయ్యప్ప నామసర్మరణతో మార్మోగింది.

ఇబ్రహీంపట్నంలో.. ఇబ్రహీంపట్నంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద శనివారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. జైన్ శ్రీరాంరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కాగా, ప్రతీయేటా ఇక్కడ పెద్ద ఎత్తున మహా పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తారు.



విద్యార్థులు కష్టపడి చదవాలి



కేజీబీవీలో భోజనం చేస్తున్న డీఈవో

మాడ్గుల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి కష్టపడి బాగా చదివి తల్లిదండ్రులు ఆశలు నెరవేర్చాలని డీఈవో సుశీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలను శనివారం డీఈవో సందర్శించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.కేజీబీవీ విద్యార్థినులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైన్స్‌ల్యాబ్, ఆట పరికరాలు కావాలని విద్యార్థినులు కోరారు. డీఈవో సానుకూలంగా స్పందించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి డీఈవో, ఎంఈవో సర్దార్ నాయక్, స్పెషలాఫీసర్ రేఖ, టీచర్లు భోజనం చేశారు.

మంచి పనులకు చిరస్థాయి కీర్తి

ఆమనగల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మనుషులు జీవిత కాలంలో చేసిన మంచి పనులు మరణానంతరం కూడ కీర్తించబడుతాయని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ జిల్లా నేత ఎంగిళి రఘు మాతృమూర్తి సుశీలమ్మ సంతాప కార్యక్రమం శనివారం ఉదయ్‌నగర్ కాలనీలో నిర్వహించారు. జైపాల్ సుశీలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమనగల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్, మాజీ ఎంపీపీలు ధనుంజయ్య, అనితవిజయ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, జగన్, మానయ్య, శ్రీశైలం, శ్రీనివాస్ ఉన్నారు.



కడ్తాల : సమ్మెకు మద్దతు తెలుపుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

కడ్తాల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సిబ్బంది న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన సమ్మెను శనివారం ఆయన సందర్శించారు. సమ్మెలో కూర్చున్న కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి రూ.18,500 కనీస వేతనం అందించి పర్మనెంట్ చేయాలని, రూ.5లక్షలు ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు ప్రకటించారు. మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, నాయకులు మంగళపల్లి నర్సింహ, కొప్పు కృష్ణ, మాధవులు, వెంకటేశ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వే తన చట్టాన్ని అమలు చేస్తూ.. బీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టి సమ్మె శనివారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీవో గీతలకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు నర్సింహ, హరికృష్ణ, జంగయ్య, రాములు, చంద్రయ్య, చెన్నయ్య, రాములమ్మ, లక్ష్మమ్మ, రాధిక, విజయ, జంగమ్మ తదితరులున్నారు.

కేశంపేట : గ్రామ పంచాయతీ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మిక సంఘం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిరాల రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన టోకెన్ సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్మికులు టోకెన్ సమ్మెను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న తెలంగాణ పంచాయతీ రాజ్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఇబ్బందిగా ఉన్న జీవో 51ను సవరించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, గ్రీన్‌ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మికులు రవి, పద్మ, పారేశ్, జంగయ్య, మల్లేష్, రాములు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని నాయకులు జగదీశ్వర్‌గౌడ్, మధురెడ్డి, రాజేష్‌లు తెలిపారు. మండల పరిధిలోని పెద్దమంగళారం అనుబంధ గ్రామమైన చిన్నషాపూర్ గ్రామానికి చెందిన మురళీగౌడ్ ఏడాది క్రితం మృతిచెందాడు. ఆయన జ్ఞాపకార్థం స్నేహితులైన జగదీశ్వర్ గౌడ్, మధురెడ్డి, రాజేష్‌లు గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. 33 జట్లు పాల్గొని పోటీల్లో హోరాహోరీగా తలపడ్డాయి. హిమాయత్‌నగర్ జట్టు మొదటి బహుమతి, కుత్బుద్దీన్‌గూడ రెండో బహుమతి దక్కించుకున్నాయి. నిర్వాహకులు బహుమతులు అందించారు.

షాద్‌నగర్ సభను జయప్రదం చేయాలి

కేశంపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) షాద్‌నగర్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గుట్టల గడ్డ తండాలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ తండా అధ్యక్షుడిగా వడ్త్యా గణేష్, ఉపాధ్యక్షులుగా భాస్కర్ నాయక్, శ్రీనునాయక్, లక్ష్మయ్య నాయక్, ప్రధాన కార్యదర్శులుగా హీర్యా నాయక్, తుకారాం, శంకర్, భాస్కర్ నాయక్, సభ్యులను ఎన్నుకున్నారు.

వైభవంగా హనుమాన్ పల్లకీ సేవ

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో హనుమాన్ పల్లకీ సేవ నిర్వహించారు. అంతకు ముందు అంజనేయస్వామికి ఆలయ పూజారి రాఘవేంద్రాచారి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో పెట్టి ఆలయం చుట్టూ ప్రదర్శన చేస్తూ భజన చేశారు. భక్తులకు కాంట్రాక్టర్ గోపాల్‌రెడ్డి అన్నదానం చేశారు. అయ్యప్పలకు భద్రప్ప బిక్ష పెట్టారు. ప్రముఖులు శ్రీశైలంగౌడ్, సి.మహేందర్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, నర్సింహులు గుప్తా, వసంత రావు, జి.రమేష్, అశోక్, రఘుగౌడ్, బాల్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, లక్ష్మయ్య, బచ్చన్న, ప్రవీణ్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

తాళం వేసిన ఇంటికి కన్నం

- రూ.3లక్షలు, బంగారం, వెండి ఆభరణాలు అపహరణ
- కుటుంబ సభ్యులు దైవ దర్శనానికి వెళ్లడంతో ఇల్లు గుల్ల
- కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

చేవెళ్ల/శంకర్‌పల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లిన వారి ఇంట్లో దొంగలు చొరబడి రూ.3లక్షల నగదుతో పాటు 2 తులాల బంగారం, 80 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్‌నకు చెందిన వీరయ్య కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి శుక్రవారం ఉదయం యాదగిరిగుట్టకు వెళ్లారు. శనివారం మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.3లక్షల నగుదు, 2 తులాల బంగారు ఆభరణాలు. 80 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. అయితే, ఇంటితాళం పగులగొట్టి డోర్లు తెరిచి ఉండడం గమనించిన పక్కింటి వారు.. వీరయ్యకు, పోలీస్‌లకు సమాచారం అందించారు. దాంతో బాధిత కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకొని చూడగా బీరువాలో నగదు, బంగారం, వెండి కన్పించలేదు. పోలీస్‌లు క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. ఈ మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు.

యువకుడు అదృశ్యం

చేవెళ్ల/శంకర్‌పల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): హెయిర్ కటింగ్ కోసం వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 27న చోటుచేసుకుంది. బిహార్ నుంచి బిందుకుమారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామ పరిధిలో వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 27న సాయంత్రం బిందుకుమారి సోదరుడు దీపక్ కుమార్ హెయిర్ కటింగ్ షాపుకు వెళ్తునట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. హెయిర్ కటింగ్ చేయించుకొన్న తర్వాత ఇంటికి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం మోకిల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యువకుడి ఆచూకీ తెలిస్తే 87126-63499 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఫోన్‌పే చేసినా డబ్బులు రాలే..

- కొన్ని రోజులుగా రూ.65 వేల మద్యం కొనుగోలు
- డబ్బులు రాలేదని గమనించిన వైన్‌షాపు నిర్వాహకులు
- పోలీస్‌లకు ఫిర్యాదు.. అదుపులో నలుగురు మైనర్లు
- ఫేక్ ఫోన్‌పే యాప్ వాడినట్లు గుర్తింపు

చేవెళ్ల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఫోన్‌పే యాప్ ద్వారా డబ్బులు చెల్లించి నమ్మించి వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసిన నలుగురు మైనర్లను ఎస్వోటీ గుర్తించి శనివారం కేసును చేవెళ్ల పోలీస్‌లకు అప్పగించారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఉన్న దుర్గా వైన్ షాపులో రూ.65వేల మద్యం కొనుగోలు చేసిన మైనర్లు డబ్బు చెల్లించే క్రమంలో మోసగించారు. షాపు యజమాని కౌంటర్‌లో డబ్బు తక్కువగా వస్తుందని గుర్తించి సీసీ టీవీ ఫుటేజీని చెక్ చేయగా.. కొందరు తరచూ కౌంటర్ బిజీగా ఉండే సమయంలో వచ్చి మద్యం కొనుగోలు చేసినట్లుగా గుర్తించి ఎస్వోటీకి సమాచారం అందించాడు. దాంతో ఆ బృందం రంగంలోకి దిగి సీసీ టీవీ ఫుటేజీని క్షుణంగా పరిశీలించి నలుగురు మైనర్లను గుర్తించి పట్టుకున్నారు. అయితే, వారు కొన్ని రోజులుగా అదే వైన్‌షాపులో మొత్తం 65 వేల మద్యం కొనుగోలు చేసినట్లుగా తెలిసింది. ఫేక్ ఫోన్‌పే ద్వారా డబ్బులు వేసినట్లు చూపించి.. మద్యం తీసుకెళుతున్నట్లు గుర్తించారు. యాజమానికి మాత్రం ఫోన్ పే ద్వారా డబ్బులు రావడం లేదు. పట్టుబడిన వారిని చేవెళ్ల పోలీస్‌లకు అప్పగించటంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఫేక్ ఫోన్‌పే యాప్ ఎలా వచ్చింది? ఎవరి ద్వారా దీనిని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నారు? ఇంకా ఈ తతంగంలో ఎవరెవరు ఉన్నారనే కోణంలో పోలీస్‌లు దర్యాప్తు చేపట్టారు. ఫేక్ యాప్ ద్వారా పట్టుబడిన నలుగురూ మైనర్లేనని పోలీస్‌లు చెప్పారు. వైన్‌షాపులో పనిచేస్తున్న వారి హస్తం ఉందని అనుమానిస్తున్నారు. కాగా, ఇలాంటి సైబర్ క్రైమ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్‌లు సూచించారు.

పీజేఆర్ సేవలు మరువలేనివి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



పీజేఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కార్మిక నాయకుడిగా, శాసన సభ్యుడిగా పి.జనార్ధన్‌రెడ్డి(పీజేఆర్) చేసిన సేవలు మరువలేనివని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. షాద్‌నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే పీజేఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మిక సంఘం నాయకుడిగా జనార్ధన్‌రెడ్డి తన ప్రస్థానాన్ని ప్రారంభించి, ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఎనలేని ప్రజాసేవ చేశారని, పీజేఆర్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు పి.వెంకట్‌రాంరెడ్డి, శివశంకర్‌గౌడ్, ఎ.కృష్ణారెడ్డి, కె.చెన్నయ్య, గడ్డం శ్రీనివాస్, అగ్గనూరి బస్వం, అంబటి ప్రభాకర్, చంద్రశేఖర్, మసూద్‌ఖాన్, యాదగిరియాదవ్, ఎల్.శివశంకర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పెంచుకుంటేనే ప్రగతి : ఎమ్మెల్యే

పోటీ ప్రపంచంలో ప్రతిభ పెంచుకునే యువత మాత్రమే జీవితంలో ప్రగతిని సాధిస్తారని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో స్నిఫీ నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం శనివారం షాద్‌నగర్ మున్సిపాలిటీ సమావేశ హాలులో నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ యువత నేటి సమాజంలో మంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలుగా ఎదగాలంటే సరైన శిక్షణను తీసుకోవాలని సూచించారు. యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి మార్గాలను చూయిస్తున్న మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థలను ఎమ్మెల్యే అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు. యువతలో విజ్ఞానాన్ని మరింతగా పెంచడానికి తరచు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూ, యువతకు మార్గం చూపాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ, ముందుకు సాగుతున్నారని శంకర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

షాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే సుస్థిరపాలన సాధ్యమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి సీతారాంపూర్‌లో 234 బూత్ కమిటీ వేశారు. అధ్యక్షుడిగా నర్సింహాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, బీసీమోర్చా జిల్లా కార్యదర్శి మాణయ్య, నాయకులు అనంతం, మహేందర్, ప్రశాంత్, సతీష్‌గౌడ్, తదితరులుపాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని కిసాన్‌మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మోర నర్సింహారెడ్డి సూచించారు. మండలంలోని మోత్కుపల్లిలో శనివారం బూత్ కమిటీ అధ్యక్షుల నియామకాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని చేపట్టారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య అలియాస్ రత్నం, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.